


# నవభూమి పాలమూరు

అనుబంధం

27 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


# ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం




## మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్–నవభూమి** : ప్రాజెక్టుల పూర్తికి కట్టుబడి ఉన్నామని, రూ.50వేల కో ట్లతో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జి ల్లాలోని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అంజనగిరి రిజర్వాయర్‌ను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నీ టిపారుదల శాఖ అధికారులతో కలిసి మంత్రులు పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రాజెక్టు పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీ డియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ గతంలో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు దృఢసంకల్పంతో మంత్రుల బృందం అడుగులు వేస్తుందన్నా రు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పీఆర్‌ఎల్‌ఐ, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, గట్టు ప్రాజెక్టుల పురోగతిలో ఉన్న, పెండింగ్ పనులను నూటికి నూరు శా తం పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. సీఎం రేవం త్ సొంత జిల్లా పాలమూరులో సాగునీటి సమస్య లేకుం డా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉదండాపూర్‌లో భూసేకరణ పరిహారం ఆరేడు నెలల్లో ఇస్తామన్నారు. నార్లాపూర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నా రు. కాల్వల టెండర్లను త్వరలో చేపడుతామని ప్రకటించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ సీఎం సొంత జిల్లా కావడంతో ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల పూర్తికి మంత్రి ఉత్తమ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఎకరాకూ నీళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భూసేకరణలో నిర్వాసితులకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తామన్నారు. రూ.50 వేల కోట్లతో జిల్లాలోని పెండిం గ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. ప్రతి రెండు నె లలకోసారి సమీక్షలు నిర్వహించి పాలమూరులోని ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. వచ్చే మూడు, నాలుగేండ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమం లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎ మ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, విజయుడు, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అధికారులు ఉన్నారు.

# నిర్వాసితుల అడ్డగింత

**జడ్చర్ల–నవభూమి** : ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు వాసులు నిరసన తెలిపారు. బుధవారం రిజర్వాయర్ పనుల పరిశీలనకు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లితోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వచ్చారు. వీరికి తమ గోడు వెల్లబోసుకునేందుకు వెళ్తున్న నిర్వాసితులను అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యా యం చేస్తారని అనుకుంటే మధ్యలోనే ఎంపీ, ఎమ్మెల్యే, పోలీసులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం..**

ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెనుకబడిన జి ల్లాను సస్యశ్యామలం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను మంత్రి జూపల్లి, నీటి పారుదలశాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అంతకుముందు వల్లూరు–కిష్టారం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పీఆర్‌ఎల్‌ఐ పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తామ ని చెప్పారు. భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి రూ.45 కోట్లు విడుదల చేశామన్నారు. ముంపు వాసులకు పునరావాసం కల్పిస్తామని హామీ ఇ చ్చారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలోని నాలుగు తండాల కు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఎగువ నుంచి కృష్ణమ్మ పరుగులు



**గద్వాల–నవభూమి** : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతుంది. ప్రాజెక్టుకు ఎగువ నుం చి 72 వేల కూసెక్కులు చేరుతుండగా ఏడు గే ట్లు ఎత్తినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కా గా ప్రస్తుతం 318.350 మీటర్లు, పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 9.316 టీఎంసీలు ఉన్నది. అదేవిధంగా ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 550, భీమా ఫేజ్–1కు 650, ఆర్టీఎస్ లింక్ కెనాల్‌కు 50, విద్యుత్ ఉత్పత్తికి 37,715, మొత్తం 90,161 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.

**ఆర్డీఎస్, టీబీ డ్యాంకు స్వల్ప వరద**

కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఆర్డీఎస్‌కు ఇన్‌ఫ్లో 9,310, అవుట్ ఫ్లో 8,700 క్యూసెక్కులు నమోదైంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9 అడుగుల మేరకు నీటి మట్టం ఉ న్నది. అలాగే తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 7,350, అవుట్‌ఫ్లో 10,119 క్యూసెక్కులు న మోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామ ర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 101.226 టీ ఎంసీల నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మ ట్టానికి గానూ 1631.86 అడుగులు ఉన్నది.

**ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు..**

ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 15,002 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 12,144 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకుగానూ 1704.72 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటినిల్వ 129.72 టీఎంసీలకు గా నూ, ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్న ది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 13,332, అవుట్ ఫ్లో 14,307క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠ నీటి మట్టం 1615అడుగులకు గానూ ప్రస్తుతం 1614.93 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.59 టీఎంసీలు ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**కోయిల్‌సాగర్ రెండు గేట్ల ఎత్తివేత**

కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద చేరుతున్నది. దీంతో బుధవారం ప్రాజెక్టు వద్ద రెండు గేట్లు ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని ఊకచెట్టు వాగులోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ 32.5 అడుగులు ఉన్నది. ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుండడంతో సందర్శకుల తాకిడి పెరిగింది.

# నోటీసులు హడల్



## గడువులోగా సీఎంఆర్ సేకరిస్తాం



**మహబూబ్‌నగర్-నవభూమి** : సీఎంఆర్ బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ టి.విక్రమ్ తెలిపారు. ఈ నెల 24న 'నమస్తే తెలంగాణ' లో పాలమూరులో రూ.9కోట్ల ధాన్యం స్వాహా? 2023-24మాన్‌సూన్ సీజన్‌కు సంబంధించి గడువులోగా సీఎంఆర్ సేకరణ ప్రశ్నార్థకమే..? అంటూ 'మిల్లర్ల మాయ!' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇన్‌చార్జి డీఎం స్పందించారు. 2023-24 వానకాలం సీజన్‌కు గానూ 86శాతం, యాసంగి సీజన్‌కు గానూ 50శాతం సీఎంఆర్ సేకరణ పూర్తయ్యిందన్నారు. 2023-24 వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి నిర్దేశిత గడువు ఈ నెల 30వ తేదీలోగా మిగిలిన సీఎంఆర్ బియ్యం వేగవంతంగా సేకరణ చేపడతామని తెలిపారు. 2022-23 సీజన్‌కు సంబంధించి మహబూబ్‌నగర్ అల్లీపూర్ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఇండస్ట్రీస్ రైస్ మిల్లర్ 3002.412 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ.9.44కోట్లు పక్కదారి పట్టించడంపై జూలై 12న క్రిమినల్ కేసు (ఎఫ్ఐఆర్ నం.412/2024) నమోదు చేశామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ఆర్ఆర్ యాక్ట్ అమలు పర్చనున్నట్లు వెల్లడించారు.

## బస్సులు ఆపాలి



**ఆత్మకూరు-నవభూమి** : బస్సులు ఆపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మండలంలోని పిన్నెంచర్ల గేటు వద్ద బుధవారం విద్యార్థులు, మహిళలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ప్రయాణాలు ఇబ్బందికరంగా మారాయన్నారు. బస్సు డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ స్టేజీల వద్ద బస్సులు నిలపకుండా వెళ్లిపోతున్నారన్నారు. మహిళలు, విద్యార్థులు స్టేజీల వద్ద నిలబడ్డా ఆ పడంలేదన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీహరికి తెలిపినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆరోపించారు. రాస్తారోకోతో రాకపోకలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న సీఐ శివకుమార్ అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరడంతో మహబూబ్‌నగర్ డిపో మేనేజర్‌తో బస్సులు ఆపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు మనోహర్‌గౌడ్, గ్రామస్తులు అశోక్‌భూపాల్, కరుణాకర్‌గౌడ్, అశోక్‌నంద, శివశంకర్, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

**వనపర్తి-నవభూమి** : రానున్న వారం పది రోజులు మరిన్ని వర్షాలు పడే అవకాశం ఉన్నందున డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మరో నెలపాటు జాగ్రత్తలు తీసుకోవాలని దోమలు ప్రబలకుండా ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. అన్నిప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సైతం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డెంగ్యూ పాజిటివ్ వచ్చిన ప్రాంతంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 30 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరికి డయాబెటిస్ వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సునందిని, డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు హడల్

**మహబూబ్‌నగర్-నవభూమి** : పాలమూరులో పేదల ఇండ్లకు త్వరలో నోటీసులు అందనున్నాయనే విషయం తెలియడంతో నిరుపేదల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పెద్ద చెరువు నాలా పరిధిలో ఇండ్ల నిర్మాణాలు ఉన్నాయనే పేరుతో అధికారులు నోటీసులు జారీ చేయడం కలకలం రేపుతోంది. బడాబాబుల వైపు కన్నెత్తి కూడా చూడని అధికారులు అధికార వర్గం అండదండలు ఉండే పెద్దల నిర్మాణాల విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే సర్వే నెంబరు 523లో దివ్యాంగుల ఇండ్లను అర్ధరాత్రి కూల్చివేసిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు వారికి పునరావాసం కల్పించలేదు. ఇప్పుడు కొత్తగా పెద్ద చెరువు నాలా ఆక్రమణల పేరుతో నోటీసులు జారీ చేయడంతో నిరుపేదలు ఆగం అవుతున్నారు. పాలమూరులో పెద్దచెరువు పరిధిలో ఆక్రమణలు వదిలేసి.. ఎఫ్‌టీఎల్ పరిధి పూర్తిస్థాయిలో నిర్ధారించకుండా.. మైత్రీనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో పెద్దచెరువు నాలా ఆక్రమణల పేరుతో నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాల విషయంలో అధికారుల తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకే కూల్చివేతల ప్రణాళికలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహబూబ్‌నగర్ మున్సిపల్ అధికారులు ఎలాంటి హడావుడి లేకుండానే పావులు కదుపుతుండడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

**నిరుపేదలపైనే ప్రతాపం..**

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన బడాబాబుల నిర్మాణాలను కూల్చివేయకుండా.. సామాన్యులు, నిరుపేదలు నిర్మించుకునే ఇండ్లను కూల్చివేసేందుకు ప్రణాళికలు రచిస్తుండటం పాలమూరులో వివాదాస్పదంగా మారింది. బిల్డర్లు, డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన తప్పిదాలకు సామాన్యులను బలిచేస్తున్నారని కొందరు వాపోతున్నారు. ఎన్నో ఏండ్ల కిందట ఇతరుల నుంచి భూములు కొనుక్కుని ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి గూడు కట్టుకుంటే.. ఇన్నాళ్లు కిమ్మని అధికారులు గతంలో వారే ఆయా ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించడం, విద్యుత్ మీటర్లు బిగించడం,పన్నులు వసూలు చేయడం వంటి వాటన్నింటినీ అధికారికంగా చేపట్టిన అధికారులు ఇప్పుడు



అనుమతులు లేవంటూ.. నాలా ఆక్రమించారంటూ.. బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయంటూ నీటిపారుదల శాఖ అనుమతులు, ఎన్‌వోసీ, ఇతర విలువైన డాక్యుమెంట్లు లేవంటూ సవాలక్ష మెలికలు పెడుతుండటం నిరుపేదల గుండెలపై పిడుగు పడ్డట్లు అవుతోంది. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మల్లమ్మకుంట, పెద్దచెరువు, ఎర్రకుంట, ఇమాంసాబ్‌కుంట, పాలకొండ పెద్దచెరువు, ఊరచెరువు, బోడోనికుంట తదితర చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలా, ఇతర ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇండ్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఆయా ఇండ్లకు సైతం త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నీటిపారుదలశాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వే ఆధారంగా చెరువులు, కుంటలు, నాలాలు, ఆయకట్టు ప్రాంతాల్లో ఇండ్లను నిర్మించుకున్న 70మందికి నోటీసులు జారీ చేసినట్లు మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండే ఇండ్లకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తున్నామని అందులో భాగంగానే ఆయా ఇండ్ల యజమానుల వద్ద ఇంటి నిర్మాణాలకు సంబంధించిన నీటిపారుదలశాఖ ఇచ్చిన ఎన్‌వోసీ, మున్సిపల్ అనుమతులు, తదితర డాక్యుమెంట్లు వారం రోజుల్లో సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

# వైద్యులుగా మాకు బాధ్యత ఉన్నది

**జగిత్యాల-నవభూమి** : ప్రజాప్రతినిధులుగా, వైద్యులుగా తమకు బాధ్యత ఉందని, అందుకే ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా దవాఖానలను పరిశీలించి పరిస్థితులపై ప్రభుత్వం, సీఎం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి నివేదిక ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని బీఆర్ఎస్ వైద్య ఆరోగ్య త్రీమెన్ కమిటీ మెంబర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. నిర్మాణాత్మకమైన సలహాలు ఇచ్చేందుకే హాస్పిటళ్లను పరిశీలిస్తున్నామని, తమను అడ్డుకోవడం, అరెస్ట్ చేయడం సరికాదని సూచించారు. బుధవారం ఉదయం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానతోపాటు మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. దాదాపు రెండు గంటలకుపైగా అన్ని వార్డులను పరిశీలించి,అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా రోగులు, వారి కుటుంబసభ్యులు గోడు వెల్లబోసుకున్నారు. 'సార్ కేసీఆర్ సార్ హయాంలో వచ్చినట్లు బాలింతలకు కిట్లు, రూ.12వేల పారితోషికం వస్తే బాగుండు. అన్నలు ఇవ్వడం లేదు' 'పేషెంట్‌కు యూరిన్ పైపు వేసేందుకు రూ.100 వసూలు చేస్తున్నరు. ఇదేం గోస' 'పక్షవాతం వచ్చిన రోగికి ఒకే గోలి ఇస్తున్నరు. ఇదేం వైద్యమో..? అర్థమైతలేదు' అంటూ చెప్పుకున్నారు. భోజనం శుచి, శుభ్రత లేదని, మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. వ్యాధి నయమవాలని వస్తే.. ఇక్కడి కొత్త రోగాలు వచ్చే పరిస్థితి దాపురించిందని చెప్పుకోగా, ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. దవాఖాన వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మాట్లాడారు. జగిత్యాల ప్రధాన దవాఖానను సైతం సాధారణ రీతిలోనే పరిశీలించామని, సిబ్బందికి, రోగులకు ఎక్కడ ఇబ్బందులు సృష్టించలేదని, అనవసర ఆరోపణలు సైతం చేయడం లేదన్నారు. దవాఖానలో ప్రధానంగా బెడ్స్ కొరత తీవ్రంగా ఉందని, వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు, స్టాఫ్ పనితీరు చాలా వరకు బాగానే ఉందని చెప్పారు. అయితే కొందరు వైద్యులు సమయ పాలన పాటించడం లేదని, కొందరు సిబ్బంది సరిగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు తమ పరిశీలనలో వెలుగులోకి వచ్చాయన్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రం చాలా బాగుందని, రోగులకు సౌకర్యవంతంగా, విశాలంగా ఉందన్నారు. కేసీఆర్ కిట్, 12వేల పారితోషికం చాలా ఎక్కువ ప్రభావం చూపిందని, ఫలితంగా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య 70 శాతానికి చేరిందన్నారు. అయితే కొన్నాళ్లుగా కేసీఆర్ కిట్లు, పారితోషికాలను నిలిపివేయడంతో ప్రసవాల సంఖ్య తగ్గిపోవడానికి కారణమైందని వివరించారు. సకల సదుపాయాలతో ఉన్న ఎంసీహెచ్‌లో సిజేరియన్లు ఎక్కువ కావడం సరికాదన్నారు. వసతులు లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిజేరియన్లు జరిగాయంటే అర్థం ఉందని, అన్ని వసతులు ఉన్న చోట ఇలా జరగవద్దని, వీలైనంత వరకు సాధారణ కాన్పు అయ్యేలా చూడాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ దవాఖానలో భోజన తయారీ కేంద్రం అత్యంత బాధాకరమైన స్థితిలో ఉందని, అపరిశుభ్రత రాజ్యమేలుతుందని, ఇలాంటి చోట తయారయ్యే భోజనంలో లక్కపురుగులు రాకుంటే? ఏం వస్తాయని ప్రశ్నించారు. ఒక్కచోట భోజనం తయారు చేసి మరో చోటుకి తరలించడం సరిగా లేదన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని



## దంచికొట్టిన వాన





**ఇటిక్యాల-నవభూమి** : జోగుళాంబ గద్వాల జిల్లాలో వర్షం దంచికొట్టింది. రెండ్రోజులుగా కురుస్తున్న వానలకు తోడు నేడు పడడంతో వాగులు, వంక లు పొంగిపొర్లాయి. దీంతో ఆయా గ్రామాల మ ధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికు లు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని ఊరచెరువు అలు గు పారడం.. సాతర్ల వాగు ఉధృతంగా పారింది.అలాగే ఎర్రవల్లి మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో నీరంతా పంటపొలాల్లోకి చేరి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గార్లపాడు, షేక్‌పల్లి, వల్లూరు పెద్ద వాగులు పొంగాయి. అధికారులు స్పందించి వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటిక్యాల-మానవపాడు పెద్దవాగు పరిసరాల్లో రాత్రి కురిసిన వర్షంతో పెద్దవాగు ఉప్పొంగింది. మానవపా డు- అమరవాయి, మానవపాడు-గోకులపాడు గ్రామాల మధ్యన ఉన్న వాగు ఉధృతంగా పారా యి. ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

## పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

**కొల్లాపూర్-నవభూమి** : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి వలసల జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుదలతో ఉందని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బు?ధవారం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు రాష్ట్ర ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నార్లాపూర్ రిజర్వాయర్‌ను పరి శీలించారు. వారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జీరో పాయింట్, అప్రోచ్ కెనాల్, సర్జ్‌పూల్‌తో పాటు పాలమూరు రంగారెడ్డి మెయిన్ కెనాల్‌ను పరిశీలించారు. అ నంతరం ప్రాజెక్టు ఉన్నతాధికారులతో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి అధికారులతో రివ్యూ నిర్వహించా రు. అనంతరం మంత్రి ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి, ఎంజీఎల్ఐ, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, గట్టు లిఫ్టు ఇరిగేషన్ వీటన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభు త్వం పట్టుదలతో, ఉందని అందులో భాగంగానే పెండింగ్ ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపట్టామన్నారు. అంతకు ముందు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భూమిని కోల్పోయిన నిర్వాసితులు తమకు ఆర్‌అండ్‌ఆర్ పథకం కిం ద జీవో 123 ప్రకారం నిర్వాసితుల పరిహారం ఇవ్వాలని మంత్రులు ఉత్తమ్, జూప ల్లి దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితుల సమస్యలను సానుకూలంగా విన్నమంత్రులు వాటిని పరిశీలిస్తామని వారికి భరోసా కల్పించారు. హెలికాప్టర్ ద్వారా పాలమూ రు రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించిన మంత్రులకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికా రులు, స్థానిక కాంగ్రెస్ నేతలు శాలువా, పూల మాలలతో స్వాగతం పలికారు.



# రెండు బడులు.. ఒకే మూత్రశాల



**జగిత్యాల-నవభూమి** : జాబితాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను ఒకేచోట నిర్వహిస్తున్నారు. హైస్కూల్‌లో 77 మంది, ప్రాథమిక పాఠశాలలో 62 మంది మొత్తం 139 మంది విద్యనభ్యసిస్తున్నారు. అందులో 77 మంది బాలురు, 62 మంది బాలికలు ఉన్నారు. హైస్కూల్‌లో 36 మంది బాలికలు ఉన్నారు. ఈ రెండు పాఠశాలలకు కలిపి ఒకే ఒక మూత్రశాల ఉండడంతో విద్యార్థులు మరీ ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోగా వాటిని కూల్చివేయడంతో ఉన్నత పాఠశాలలో ఉన్న ఈ ఒక్క మూత్రశాలే దిక్కయ్యింది. విరామ సమయంలో మూత్ర విసర్జన చేసేందుకు విద్యార్థినులు క్యూలో నిలబడి, నిరీక్షించాల్సి వస్తుంది. క్యూలో నిలబడే ఓపిక లేక చాలా మంది సమీపంలోని తమ ఇండ్లకు వెళ్లివస్తున్నారు. పాఠశాల కాంపౌండ్‌కు ఆనుకొని గుట్ట బోరు ఉండడంతో బాలురు ఒంటికి, రెంటికి అక్కడికే వెళ్తున్నారు. వానకాలం కావడంతో గుట్ట ప్రాంతం చెట్లు, గడ్డితో నిండి ఉండడంతో ఇటీవలి కాలంలో బాలురు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. కొందరు ఆడపిల్లల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. బడికి వచ్చేటప్పుడు ఇంటి వద్ద మూత్ర విసర్జన చేసి వస్తున్నామని, బడిలో దాహమైనా నీళ్లు తాగడంలేదని చెబుతున్నారు. మళ్లీ బడి ముగిసి ఇంటికి వెళ్లిన తర్వాతనే నీళ్లు తాగుతున్నామని పలువురు బాలికలు తమ ఆవేదనను వెలిబుచ్చారు.

**చలించిపోయిన ఎమ్మెల్సీ కవిత**

జాబితాపూర్ ప్రభుత్వ బడుల్లో మూత్ర విసర్జన కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వెలుగు చూశాయి. పలు సామాజిక మాధ్యమాల్లో ఫోటోలు వైరల్ కావడంతో ఎమ్మెల్సీ కవిత చూసి చలించారు. సమస్యను తెలుసుకొని విద్యార్థులకు అండగా నిలువాలని సామాజిక మాధ్యమం ద్వారా జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతకు సూచించగా, బుధవారం ఆమె స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను కండ్లారా చూసి ఆమె సైతం చలించిపోయారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, అధైర్య పడొద్దని దావ వసంత విద్యార్థులకు భరోసానిచ్చారు. 139 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒకటే టాయిలెట్ ఉంటుందా..? మరీ ఇంత ఘోరమా..? పిల్లల పరిస్థితి చూస్తే హృదయం చలించిపోతున్నది' అని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆవేదన చెందారు. వెంటనే అవసరమైన టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చలించిపోగా, ఆమె సూచనల మేరకు బుధవారం పాఠశాలను దావ వసంత పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మౌలిక వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు చేపట్టిన 'మన ఊరు మన మనబడి' పథకం పేరు మాత్రం మార్చివేసిందని, ప్రగతిని గాలికొదిలేసిందని మండిపడ్డారు. పాఠశాలలో 139 మంది విద్యార్థులకు ఒకటే టాయిలెట్ ఉండడం బాధాకరమన్నారు. తాను జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలోనే స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు 10లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు చేయకపోగా, నిధులను సైతం జడ్పీకి తిరిగి పంపించారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు జాబితాపూర్ స్కూల్ ఎంపికైందని పనులు ఎందుకు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇటీవల ఓ ప్రజాప్రతినిధి తన వ్యక్తిగత అభివృద్ధి కోసం కందువా మార్చి, నియోజకవర్గ అభివృద్ధి కోసమని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఏది ఏమైనా స్కూల్లో వెంటనే టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు జలంధర్, రూరల్ మండల సమన్వయ కమిటీ సభ్యులు చిత్తరి శ్రీనివాస్, పడిగెల గంగారెడ్డి, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చిత్తారి సురేశ్, బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ గౌడ్, నాయకులు మహేశ్, సంతోశ్, సాగర్, ప్రణయ్, ప్రతాప్, సాయి ఉన్నారు.

# పండుగలోగా పీఆర్సీ ఇవ్వండి



**వేములవాడ-నవభూమి** : దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని.. కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని కోరారు. వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్‌ఆర్‌ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారన్నారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317జీవో తీసుకువచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. కనీసం స్పౌజ్‌ను కూడా పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. ఇటీవల తాము 130కోట్లు వరద బాధితులకు సాయంగా అందించామని గుర్తుచేశారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, కొమరవెల్లి, బాసర ఆలయాలకు చెందిన దాదాపు 200మంది ఉద్యోగులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ రమేశ్‌బాబు, కో చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టీఎన్‌జీవో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, సిద్దిపేట జిల్లాల టీఎన్‌జీవో అధ్యక్షులు ఎల్లాని ప్రవీణ్, దారం శ్రీనివాస్‌రెడ్డి, మిరియాల నాగేందర్‌రెడ్డి, పరమేశ్వర్, పలు ఆలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న గ్యాంగ్ వార్స్





**మంచిర్యాల-నవభూమి** : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గ్యాంగ్‌వార్స్ హడలెత్తిస్తున్నాయి. ప్రశాంతంగా ఉన్న నగరంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ రౌడీయిజం, గూండాయిజాన్ని ఉండనివ్వబోమని ప్రకటన చేసిన రోజే అర్ధరాత్రే మంచిర్యాల బైపాస్ రోడ్డులో రెండు వర్గాల యువకులు కత్తులు, రాడ్‌లతో పరస్పర దాడులు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఓ నాయకుడి దగ్గర పని చేసే వ్యక్తిపై దాడి చేసేందుకు వచ్చిన ఇద్దరి యువకులు, అక్కడే ఉన్న వాచ్‌మెన్‌తో పాటు సదరు వ్యక్తి కొట్టుకున్నారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయని పోలీసులు చెబుతున్నారు. కాగా, దాడికి వచ్చిన ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయని, ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 17న వినాయక నిమజ్జనం రోజున అర్ధరాత్రి ఐబీ చౌరస్తాలోని 'మా విందు' హోటల్‌లో ఓ బీఆర్‌ఎస్వీ నాయకుడిపై దాడి జరిగింది. హోటల్‌లో మొదలైన గొడవలో అతన్ని కొట్టుకుంటూ బయటికి తీసుకువచ్చారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌పైనా ఈ తరహాలోనే గ్యాంగ్ దాడి జరిగింది. కారు అద్దాలను ధ్వంసం చేసి హాకీ స్టిక్స్, క్రికెట్ వికెట్లతో ఓ వర్గం యువకులు విచక్షణా రహితంగా దాడి చేశారు. గతేడాది సైతం వినాయక నిమజ్జనం రోజున కూడా ఇదే తరహాలో దాడులు జరిగాయి. నిమజ్జనంలో మొదలైన గొడవ పరస్పర దాడులకు కారణమైంది. ఆ టైమ్‌లో గంజాయి బ్యాచ్ కారణంగానే గొడవ జరిగిందనే వార్తలు వచ్చాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బైపాస్ రోడ్‌లో ఏ ఇంటి దగ్గరైతే దాడి జరిగిందో.. నిన్న అక్కడే హాకీ స్టిక్స్‌తో రెండు వర్గాల యువకులు కొట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు బయటికి రావడంతో అప్పట్లో ఇది సంచలనం సృష్టించింది. ఇది జరిగిన కొన్ని రోజులకే స్థానిక హిందూబార్‌లో మద్యం సేవించిన యువకులు బయటికి వచ్చి గొడవకు దిగారు. అది గమనించిన మరో యువకుడు వారిని ఆపే ప్రయత్నం చేయగా, అందరూ కలిసి సదరు యువకుడిపై క్రికెట్‌బ్యాట్, వికెట్లతో దాడి చేశారు. తప్పించుకునే ప్రయత్నం చేసిన సదరు యువకుడిని రోడ్డుపై పరిగెత్తిచుకుంటూ మరీ దాడి చేశారు.

**గంజాయి బ్యాచ్‌లతోనే గొడవలు**

ఈ గొడవలన్నింటికీ గంజాయి బ్యాచ్‌లే కారణమని తెలుస్తున్నది. మంచిర్యాల బైపాస్‌పాస్ రోడ్డు సహా గద్దెరాగడి, తదితర ఏరియాల్లో నాలుగు నుంచి ఐదు గంజాయి బ్యాచ్‌లు ఉన్నట్లు తెలిసింది. గంజాయి సేవించడానికి అలవాటు పడిన వారిని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బైపాస్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి గొడవ జరిగిన ప్రాంతంలోనే కొందరు యువకులు గంజాయి సేవిస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. అటు వైపు వెళ్లిన వాహనదారులను సైతం అడ్డుకొని కొట్లాటకు దిగుతున్నారని, వారితో గొడవ ఎందుకని మరో మార్గం గుండా వెళ్లిపోయిన సందర్భాలున్నాయని రాళ్లపేటకు చెందిన ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెప్పారు. మంచిర్యాల చుట్టూ ఉన్న ఈ గంజాయి బ్యాచ్‌లను కొందరు సెటిల్మెంట్‌ల కోసం వాడుకుంటున్నారు. రియల్టర్లు, వ్యాపారులను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడమే వీరి పనిగా తెలుస్తున్నది. మొదట ఒకటే బ్యాచ్‌గా ఉన్న వీరంతా ఎవరికి వారు సెపరేట్ బ్యాచ్‌లుగా విడిపోయినట్లు తెలిసింది. దీంతో ఒకరికంటే ఒకరు గొప్ప అని నిరూపించుకునేందుకు కొంతకాలంగా పరస్పర దాడులకు దిగుతున్నట్లు పోలీసులు శాఖలో పని చేసే కొందరు అధికారులు చెబుతున్నారు. ఆ క్రమంలోనే సోమవారం రాత్రి గొడవ సైతం జరిగినట్లు తెలిసింది. రాత్రిళ్లు గంజాయి సేవించి రోడ్లపైకి వచ్చే ఈ బ్యాచ్‌లు వాహనదారులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనలు సైతం ఉన్నాయంటున్నారు. మరీ ఇంత దర్జాగా రాత్రి వేళల్లో గంజాయి సేవించి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారనేది అర్థం కావడం లేదు. నిత్యం పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులకు ఈ విషయం తెలియదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా, ఇటీవల మంచిర్యాలలో జరిగిన గ్యాంగ్ వార్‌లలో ఇదే బ్యాచ్ ఉన్నట్లు తెలుస్తున్నది. అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడి అండ ఉండడం వల్లే పోలీసులు వారిని ఏం చేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**గొడవపై క్లారిటీ ఇవ్వని పోలీసులు**

సోమవారం రాత్రి జరిగిన గొడవపై మంగళవారం రాత్రి వరకు పోలీసులు క్లారిటీ ఇవ్వలేదు. బైపాస్ రోడ్డులోని ఆ ఇంటి ముందు ప్రత్యేక బలగాలను మోహరించి మరీ పహారా కాశారు. ఓ పోలీస్ వాహన సైతం మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకే అదే ఏరియాలో సైరన్ వేసుకొని తిరిగింది. దీంతో స్థానికులు బయపడిపోయారు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర పోలీసులు ఉండగానే..ఆ ఇంటికి కొద్ది దూరంలో పాడుబడిన బావి సమీపంలో ఇరవై ముప్పై మంది గుమిగూడి కనిపించారు. కాసేపటికి ప్రత్యేక బలగాలు రావడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, పాత కక్షల కారణంగా కాంగ్రెస్ లీడర్ దగ్గర పని చేసే ఓ వ్యక్తిపైకి దాడికి వచ్చారని పోలీసులు చెబుతున్నా.. సోమవారం ఉదయమే గొడవ జరిగిందని, దానికి ప్రతీకారణంగానే రాత్రి వారు దాడికి వచ్చారని తెలుస్తున్నది. అందుకే పోలీసులు చాలా సేపటి వరకు క్లారిటీ ఇవ్వలేదని, ఈ ఘటనలో ఓ వర్గానికి అనుకూలంగా కేసు నమోదు చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దాడికి వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరి తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరో యువకుడు తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎం దవాఖానలో ఉన్నారు. దాడికి గల కారణాలు, దాడిలో పాల్గొన్న వారు ఎందరు అనే వివరాలపై స్పష్టత లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని పట్టణ వాసులు కోరుతున్నారు. దీనిపై మంచిర్యాల సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా.. విచారణ నిర్వహిస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

**రక్షణ కోరిన యువకుడి తల్లి..**

దాడిలో గాయపడి కరీనంగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యువకుడి తల్లి సైతం పోలీసులను ఆశ్రయించింది. మంగళవారమే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలనుకున్నానని.. కానీ మా అబ్బాయి సీరియస్‌గా ఉన్నాడని తెలిసి కరీంనగర్ వెళ్లామని చెప్పింది. బైపాస్ రోడ్డులో బండిపై వెళ్తున్న తనపై దాడి జరిగిందని మాత్రమే మా అబ్బాయి చెప్పాడని.. అనంతరం కోమాలోకి వెళ్లిపోయాడని వాపోయింది. అసలేం జరిగిందో తెలుసుకునేలోగా కేసు నమోదైనట్లు ప్రకటన వచ్చిందని పేర్కొంది. తన కొడుకుపై దాడి నేపథ్యంలో తనకు రక్షణ కావాలని పోలీసులను ఆమె కోరినట్లు సమాచారం.



## నిబంధనలు పాటించని క్లినిక్ సీజ్

**వనపర్తి-నవభూమి** : నిబంధనలు పాటించని ఓ క్లినిక్ సెంటర్‌ను వైద్యాధికారులు బుధవారం సీజ్ చేశారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో లిబర్టీ మెడికల్ షాప్‌ను ఆనుకుని ఎలాంటి బోర్డు లేకుండా క్లినిక్ సెంటర్ నిర్వహిస్తున్న కేంద్రాన్ని అధి కారులు తనిఖీ చేసి సీజ్‌చేశారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులను వివ రణ కోరగా గాంధీచౌక్‌లో ఒక మెడికల్ షాప్ పక్కన డాక్టర్ కళ్యాణ్ పేరుపై అనుమతు లు తీసుకుని ఇతర వైద్యులతో వైద్య సేవలు కొనసాగిస్తుండడం తమ దృష్టికి వచ్చింద ని, బుధవారం మధ్యాహ్నం క్లీనిక్ సెంటర్‌ను తనిఖీ చేయగా నిజాలు బయటపడడంతో సీజ్ చేశామని తెలిపారు. ఏ వైద్యుడు అనుమతి తీసుకున్నారో అతనే వైద్యసేవలు అందించాలని చెప్పారు. అలాకాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇతర వైద్యులతో ఆర్ ఎంపీ, పీఎంపీలతో వైద్యసేవలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చంద్రయ్య, రవికుమార్ ఉన్నారు.

## నైపుణ్యాన్ని వెలికితీసేందుకే డ్యూటీ మీట్



**మహబూబ్‌నగర్-నవభూమి** : పోలీసులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందు కు పోలీస్‌శాఖ ప్రతిఏటా డ్యూటీ మీట్‌ను నిర్వహిస్తుందని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో డ్యూ టీమీట్‌ను ఆయన ప్రారంభించారు. నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు డ్యూటీమీట్ ఉప యోగపడుతుందని తెలిపారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారు స్టేట్ డ్యూటీమీట్‌కు ఎంపికవుతారని తెలిపారు. ఈ డ్యూటీమీట్‌లో సైంటిఫిక్ అయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఈవె ంట్ విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, రాతపరీక్ష, ఓరల్ టెస్ట్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్ బిట్స్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టిక్ అండ్ ఓరల్ టెస్ట్, క్రైమ్ సీన్ ఫొటోగ్రఫి ప్రాక్టికల్, పోలీస్ పోర్ట్రైట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, అ బ్జర్వేషన్ టెస్ట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, యాంటీ సబాటేజ్ చెక్ ఈవెంట్ విభాగంలో వెహికిల్ సెర్చ్, గ్రౌండ్ సెర్చ్, రూమ్ సెర్చ్, యాక్సిస్ కంట్రోల్, కంప్యూటర్ అవేర్‌నెస్ కాంపి టీషన్ ఈవెంట్‌లో కంప్యూటర్ అవేర్‌నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్ ఈవెంట్‌లో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్, నార్కోటిక్ సెర్చ్ ఈవెంట్స్ నిర్వహిం చారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ రాములు, ఏఆర్ అడిషినల్ ఎస్పీ సురేష్‌కుమార్, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, ఫింగర్‌ప్రింట్స్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్ అమానుషం

**కేటీదొడ్డి-నవభూమి** : బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం అమానుషమని ఆ పార్టీ జిల్లా నాయకుడు బాసు హను మంతునాయుడు అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రం శివారులోని గట్టు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించడానికి బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణరావు, ఎంపీ మల్లురవి వచ్చారు. ఈ నేపథ్యంలో రైతుల పక్షాన వారికి వినతి పత్రం ఇచ్చేందుకు బయలు దేరిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా కర్ణాటకకు నీటిని అందిస్తే మండలం మొత్తాన్ని ఖాళీ చేయాల్సి వస్తుందన్నారు. స్థానిక రైతులతో కలిసి ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. మంత్రుల పర్యటన అనంతరం నాయ కులను విడుదల చేశారు.



## ఘనంగా యువజన ఉత్సవాలు



**మహబూబ్‌నగర్-నవభూమి** : జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను డీవైఎస్‌వో శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక పోటీలతో యువతలో దాగి ఉన్న ప్రతిభ ను వెలికితీయవచ్చని అన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. జానపద నృత్యం (సోలో), జానపద నృత్యం (గ్రూపు), జానపద గీతం (సోలో), జానపద గీతం (గ్రూపు) వ్యాసరచన, పెయిటింగ్, ఉపన్యాసం, కవిత్వం, యువక్రాంతి అంశాల్లో పోటీలు నిర్వహించారు. అదే విధంగా సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సాంస్కృతిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 350 మంది విద్యార్థులు, యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, వృత్తి నైపుణ్య కేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, న్యాయ నిర్ణేతలు దాసరి రంగయ్య, సూర్యదివకార్, రవిశంకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, కోచ్‌లు సునీల్, ఖలీల్, పర్వేజ్, అంజద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది వీరే..జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపద నృత్యం గ్రూప్‌లో (చంద్రము ఖి కల్చరర్ అకాడమీ, మహబూబ్‌నగర్), జానపద గీతాల గ్రూప్ (సరోజినీ నాయుడు ఫార్మసీ కళాశాల, మహబూబ్‌నగర్), జానపద గీతాలు సోలో నాగ చైతన్య (చైతన్య స్కూల్, మహబూబ్‌నగర్), వ్యాసరచ న నిఖిత (డైట్ కళాశాల, మహబూబ్‌నగర్), పెయిం టింగ్ అ్రస తబస్సుం (డైట్ కళాశాల, మహబూబ్ నగర్), ఉపన్యాసం షబానాబేగం (ఎన్టీఆర్ డిగ్రీ కళా శాల), సైన్స్ (శ్లోకా పాఠశాల, జడ్చర్ల) యువకాంత్రి (జెడ్పీహెచ్‌ఎస్ ఎదిర) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

## ఆదర్శ పురుషుల్లో పండిట్ దీన్‌దయాళ్ ఒకరు

**మహబూబ్‌నగర్-నవభూమి** : ప్రతీ మానవుడి శరీరం, మనస్సు, తెలివితేటలు, ఆత్మ యొక్క ఏకకాల సమగ్ర కార్యక్రమాన్ని సూ చించే సమగ్ర మానవతావాదం అనే రాజకీయ తత్వాన్ని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రూపొందించారని, అదే బీజేపీ సిద్ధాంతంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారు శాంతకుమార్ అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణం లోని 28వ వార్డు కురిహినిశెట్టి కాలనీలో ఏర్పాటు చేసిన పార్టీ మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకాగా, విశిష్ట అతిథిగా బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతకుమార్ మాట్లాడుతూ ఆదర్శ పురుషులలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఒకరని చెప్పారు. భారతదేశం ఒక స్వతంత్ర, స్వావలంబన దేశంగా ఉండాలని, వ్యక్తివాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, కమ్యూ నిజం, పెట్టుబడిదారీ విధానం వంటి పాశ్చాత్య భావనలపై భారతదేశం ఆధారపడకూడదని దీన్ దయాళ్ పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొండయ్య, కుర్వ రాములు, శేరి పాండురంగారెడ్డి, తమిళనాడు త్రిస్సుర్ అధ్యక్షుడు సెంథిల్, బురుజు రాజేందర్‌రెడ్డి, వీరబ్రహ్మాచారి, అంజయ్య, చెన్నవీరయ్య, నారాయణ, ప్రవీణ్, సురేష్, సాయికుమార్ తదితరులున్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పడాకుల బాలరాజు, పాండురంగారెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జీఎం ఆఫీస్‌ల వద్ద టీబీజీకేఎస్ ధర్నా

**నస్పూర్-నవభూమి** : సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు బుధవారం ఆందోళనలు చేపట్టారు. శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పె ట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ధర్నా చేశారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎస్‌వోటూజీఎంకు వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా పెట్టం లక్ష్మణ్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి రూ.4701 కోట్ల లాభాలు వచ్చినట్లు యాజమాన్యం ప్రకటించిందని, వాస్తవ లాభాల నుంచి సుమారు రూ. 1551 కోట్లు కార్మికులకు ఇవ్వాల్సి ఉండ గా, కేవలం రూ.796 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైందన్నారు. 33 శాతం లాభాల వా టాను ప్రకటించి, కేవలం 16 శాతమే చెల్లించాలనుకోవడం దారుణమన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ యూనియన్ ఆధ్వర్యంలో దశల వారీగా నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, సాదుల భాస్కర్, గొర్ల సంతోష్, కురుమ వికాస్, బిరుదు శ్రీనివాస్, బోడగుంట తిరుపతి, రాజేశం, సల్మాన్, సదానందం, వెంకన్న, పాదం శ్రీనివాస్, మారం శ్రీనివాస్, మేడం తిరుపతి, చిప్ప రమేశ్, తుర్రం శ్రీకాంత్, కార్తీక్, మల్లికార్జున్ పాల్గొన్నారు. మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల కష్టార్జితం వారికి దక్కే వరకూ టీబీజీకేఎస్ పోరాడుతుందన్నారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళన లు, నిరసన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏరియా ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్ రెడ్డికి వినతి ప త్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు




మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షులు బడికెల సంప త్ కుమార్, జే.రవీందర్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీహెచ్ వెంకటరమణ, కేంద్ర జాయింట్ సెక్రటరీ బెల్లం అశోక్, దాసరి శ్రీనివాస్, ఏరియా నాయకులు ఈశ్వర్, సారంగపాణి, మధుసూదన్, తోట రాజిరెడ్డి, శివ, తిరుపతి, వై.శ్రీనివాస్, చక్రపాణి, బబ్బెర మల్లేశ్, హైమద్, సాయి, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ యూనియన్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరేణికి లాభా లు తెచ్చి పెట్టిన కార్మికులకు అన్యాయం చేయడం దారుణమని, వారికి 33 శాతం వాటా చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతర ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ధరావత్ మంగీలాల్, మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, ఓరం కిరణ్, మాంతు సమ్మయ్య, బొంగు వెంకటేశ్, రమేశ్, బాబురావు, సత్యనారాయణ ఉన్నారు.

## యూ-బిట్ దర్యాప్తులో ముందడుగు

**నిర్మల్-నవభూమి** : యూ-బిట్ క్రిప్టో కరెన్సీ మోసం కేసులో పోలీసులు మరో ముందడుగు వేశారు. ప్రజలను మోసం చేసిన ఘటనలో గతంలో ఐదుగురిని అరెస్టు చేయగా.. బుధవారం మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న దాసరి రమేశ్, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సొనాల ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న బొమ్మిడి ధనుంజయ్, నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ కాలనీకి చెందిన వెంకటేశ్, కుభీర్ మండలంలోని దౌజినాయక్ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా యూ బిట్, క్రిప్టో కరెన్సీ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం, అధిక రాబడులు వస్తాయని తప్పుడు వాగ్ధానాలు ఇచ్చి ప్రజల్లో ఆశలు రేకెత్తించి పెట్టుబడులు పెట్టేందుకు కీలకపాత్ర పోషించారు.



### కీలక కుట్రదారు గుర్తింపు

యూ బిట్ పథకం వెనుక ఉన్న ప్రధాన కుట్రదారుడిని పోలీసులు గుర్తించారు. భారతదేశం అంతటా పెద్ద సంఖ్యలో ప్రజలను మోసం చేసి ఈ స్కామ్‌ను నిర్వహించింది బ్రిజ్ మోహన్ సింగ్ అని పోలీసులు తేల్చారు. ఇతనిపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇతను క్రిప్టో కరెన్సీ ముసుగులో పెద్ద ఎత్తున పెట్టుబడి దారులతో పెట్టుబడులు పెట్టించినట్లు గుర్తించారు. ఇటీవల అరెస్టయిన వారు ఎనిమిది నెలలుగా రహస్య సమావేశాలు నిర్వహించేందుకు, నాలుగు వేర్వేరు దేశాలకు వెళ్లారని, దీని పరిధిని విస్తరించడానికి సమావేశాలు నిర్వహించినట్లు విచారణలో తేల్చారు.

### బ్యాంకు ఖాతాల స్తంభన

క్రిప్టో కరెన్సీలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించిన ఖాతాలను పోలీసులు స్తంభింపజేశారు. కోట్లాది రూపాయలతో ఈ వ్యవహారం కొనసాగుతుండగా.. ఈ వ్యవహారంలో ముడిపడి ఉన్న 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ఆస్తులను గుర్తించే ప్రక్రియలో పోలీసులు నిమగ్నమయ్యారు. యూ బిట్, క్రిప్టో కరెన్సీ బాధితులు ముందుకొచ్చి స్టేట్‌మెంట్‌ను అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే కేసు దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు అండగా ఉంటామన్నారు. బాధితులు కోల్పోయిన పెట్టుబడులు తిరిగిచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. దర్యాప్తు అధికారి, ఏఎస్పీ అవినాశ్, సహాధికారులు గోపీనాథ్, ఎస్సైలు లింబాద్రి, దేవేందర్, రవి, సాయికృష్ణ, గౌష్‌లను ఎస్పీ జానకి షర్మిల ప్రశంసించారు.




### ఉపాధ్యాయులు, డీఈవోను సస్పెండ్ చేయాలి

యూ-బిట్ కాయిన్ వ్యవహారంలో ఆర్థిక నేరాలకు పాల్పడిన ఉపాధ్యాయులు, డీఈవోపై చర్యలు తీసుకోవడమే కాకుండా వారిని సస్పెండ్ చేయాలని పీఆర్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యాకటూరి సాయన్న అన్నారు. బుధవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ వ్యవహారంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉన్నారని, వీరిపై పోలీసు అధికారులు నిఘా పెంచాలన్నారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టి వేయబడుతోందని డీఈవోపై నమ్మకం లేనందున కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంఎన్‌వో(మండల నోడల్ ఆఫీసర్) సీనియర్ పీజీ హెచ్‌ఎంలకు బదులుగా జూనియర్లను నియమించడం సమంజసమని, వారిని ఎఫ్‌ఏసీ ఎంఈవోలుగా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, చంద్రశేఖర్, నర్సయ్య, గంగయ్య, మధుసూదన్ ఉన్నారు.